

ఆసుపత్రి నుంచి కుమారస్వామి డిశ్చార్జ్

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హృదయ సంబంధిత సమస్యల తో చెన్నై అపోలో ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయించుకున్న జేడీఎస్ నేత కు మారస్వామి ఆదివారం డిశ్చార్జ్ అయ్యారు. చెన్నై నుంచి బెంగళూరుకు ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. రెండు మూడు రోజులపాటు ఇంట్లో విశ్రాంతి తీసుకుని తర్వాత లోక్‌సభ ఎన్నికల కసరత్తులో భాగస్వామ్యం కానున్నారు. బీజేపీ తో పొత్తులో భాగంగా జేడీఎస్‌కు మూడు స్థానాలు కేటాయించారు. అందులో హాసన్ నుంచి సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ మరోసారి పోటీ చేయనున్నారు. కోలారు, మండ్య నుంచి అభ్యర్థులను కుమారస్వామి ఖరారు చేయాల్సి ఉంది.

సుమలతకు చుక్కెదురు

- జేడీఎస్ ఖాతాలో మండ్య
- కోలారులో మునిస్వామి గల్లంతే...



బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండ్య లోక్‌సభ నియోజకవర్గం నుంచి మరోసారి పోటీ చేయాలని భావించిన ఎంపీ సుమలతకు చుక్కెదురైంది. చివరిక్షణం దాకా ఆమె ఢిల్లీలోనే మకాం వేసి టిక్కెట్ కోసం ప్రయత్నాలు సాగించారు. బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకోవడంతో మండ్య స్థానం జేడీఎస్ పరమైంది. అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చి తిరుగులేని విజయం సాధించిన ఆమె ప్రస్తుత ఎన్నికల్లో పోటీపై సందిగ్ధంలో పడ్డారు. కన్నడ రెబెల్‌స్టార్‌గా గుర్తింపు పొందిన అంబరీశ్ సుదీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగారు. రాష్ట్ర, కేంద్ర మంత్రివర్గంలో పనిచేశారు. అంబరీశ్ రాజకీయంగా క్రియాశీలకంగా వ్యవహరించినా ఆమె ఎప్పుడూ దూరంగానే ఉన్నారు. అంబరీశ్ మృతి తర్వాత మండ్య నుంచి పోటీ చేయాలని భావించారు. 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం కొనసాగేది. దీంతో ఉమ్మడి అభ్యర్థిగా జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, అప్పటి సీఎం కుమారస్వామి వారసుడు నిఖిల్ పోటీ చేశారు. సుమలత ఏ పార్టీతో సంబంధం లేకుండా స్వతంత్రంగా బరిలోకి దిగారు. మండ్యలో పార్టీలకు అతీతంగా ఆమెకు మద్దతు పలికారు. బీజేపీ ముందస్తుగానే అభ్యర్థిని రంగంలోకి దింపలేదు. సినిమారంగంలో దక్షిణభారత్‌లో ఒకప్పటి ప్రముఖ నటిగా రాణించిన సుమలతకు రాష్ట్రంలో కీలకమైన హీరోలు దర్శన్, యశ్ ప్రచారం చేశారు. ఇలా అన్ని విధాలా అనుకూలం కావడంతో సుమలత విజయం సాధించారు. ఏడాది క్రితమే ఆమె బీజేపీకి మద్దతు పలికారు. ప్రస్తుత ఎన్నికల్లో మండ్య నుంచి మరోసారి పోటీ చేయాలని భావించారు. అందుకు తీవ్రంగానే కసరత్తు చేశారు. మండ్య మినహా మరోస్థానంలో టిక్కెట్ ఇచ్చేందుకు బీజేపీ సూత్రప్రాయంగా తెలిపింది. కానీ సుమలత మాత్రం మండ్య నియోజకవర్గం అంటే తనకు ఓ సెంటిమెంట్ అని, భర్త అంబరీశ్ సొంత జిల్లా అని అక్కడ కాకుండా మరోచోటుకు వెళ్లలేనని తేల్చి చెప్పారు. దీంతో ఆమె ప్రస్తుత ఎన్నికల్లో పోటీకి దూరమయ్యారు.

కోలారులో మునిస్వామి గల్లంతే..



కోలారు రిజర్వు నియోజకవర్గంలో ఏడుసార్లు తిరుగులేని రీతిలో కేహెచ్ మునియప్ప కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో బెంగళూరు పాలికెలో కార్పొరేటర్‌గా వ్యవహరించిన మునిస్వామి అనూహ్యంగా బీజేపీ అభ్యర్థి అయ్యారు. కేహెచ్ మునియప్పను ఓడించి ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం మరోసారి ఆయన పోటీకి ప్రయత్నించారు. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాను భేటీ అయి భవిష్యత్తు రాజకీయాలపై ప్రస్తావించారు. జేడీఎస్‌తో పొత్తు కారణంగా టిక్కెట్ ఇవ్వలేమని అయితే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కోలారు స్థానం కూడా జేడీఎస్ కోటాకు చేరింది. 28 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా బీజేపీతో పొత్తులో భాగంగా జేడీఎస్‌కు హాసన్, మండ్య, కోలారు స్థానాలు కేటాయించారు. హాసన్ నుంచి జేడీఎస్‌కు చెందిన ప్రజ్వల్ ఎంపీగా కొనసాగుతుండడంతో అక్కడ ఎటువంటి వివాదం లేదు. మరోసారి ప్రజ్వల్ హాసన్ అభ్యర్థి అయ్యారు. అయితే కోలారు, మండ్య స్థానాలు జేడీఎస్ కోటాకు వెళ్లడంతో సుమలత, మునిస్వామి రాజకీయ భవిష్యత్తు గందరగోళంలో పడింది. మునిస్వామి జేడీఎస్ కోటాలో పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

రాష్ట్రానికి పైసా బకాయి లేదు

- సకాలంలోనే గ్రాంట్లు విడుదల
- కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్



చర్చాగోష్ఠిలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పైసా కూడా కేంద్రం నుంచి బకాయి లేదని, సకాలంలోనే గ్రాంట్లు విడుదల చేశామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ తెలిపారు. కరువు పరిస్థితిని అధిగమించేందుకు జాతీయ విపత్తుల నిధి కింద వెంటనే కేంద్రం నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసిన విషయమై బెంగళూరులో కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ స్పందించారు. నగరంలో ఆదివారం థింకర్స్ ఫోరం ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో ఆమె భాగస్వామ్యులయ్యారు. కర్ణాటకకు రూ. 5,495 కోట్ల ప్రత్యేక గ్రాంటును విడుదల చేయలేదనేది పూర్తిగా అవాస్తవమన్నారు. ఫైనాన్స్ కమిషన్ తన అంతిమ నివేదికలో అటువంటి ప్రత్యేకమైన గ్రాంట్ల విడుదల సిఫారసులు చేయలేదన్నారు. కర్ణాటకకు కేటాయించాల్సిన నిధులు సకాలంలోనే విడుదల చేశామన్నారు. ప్రతి రూపాయికి లెక్కలు ఉన్నాయన్నారు. ప్రధాని గరీబ్‌కల్యాణ అన్నయోజన పథకంలో దేశవ్యాప్తంగా 80కోట్ల మందికి నెలవారీ ఉచితంగా బియ్యం అందుతోందని, ఇందులో బెంగళూరు వాసులే 30.5 లక్షలమంది ఉన్నారని తెలిపారు. జన్‌ధన్ ఖాతాలు దేశవ్యాప్తంగా 52కోట్ల మంది తెరిచారని ఇందులో బెంగళూరుకు చెందినవారే 14.68లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. చేతివృత్తులవారు రూ. 10లక్షల దాకా రుణం పొందే ముద్ర యోజనెలో బెంగళూరు నగరంలో 38.25 లక్షల మందికి రూ. 30,490 కోట్లు విడుదల చేశామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు కోటి రూపాయల దాకా రుణం ఇచ్చే స్టాండప్ ఇండియాలో భాగంగా బెంగళూరు నగరంలో రూ.467 కోట్లు 4,429 మందికి ఇచ్చామన్నారు. 2017 నుంచి 2022 మధ్య రాష్ట్రానికి సంబంధించి జీఎస్టీ వాటా సంపూర్ణంగా విడుదల చేశామన్నారు. 2024 మార్చి వరకు జీఎస్టీ వాటా బకాయి లేదన్నారు. జీఎస్టీకి ముందు ప్రగతి కేవలం 11.68 శాతం ఉండేదని, ప్రస్తుతం 15శాతానికి పెరిగిందని ఈ విషయాన్ని అంగీకరించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదన్నారు. జీఎస్టీ ప్రయోజనాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఎక్కువ లబ్ధి చేకూర్చిందన్నారు.



గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న నృసింహుడు

గరుడ గమనా.. పాహిమాం..

- ఖాద్రీశుడికి వైభవంగా గరుడ వాహన సేవ
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

కదిరి, మార్చి 24: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఇష్టవాహనమైన గరుడుడిపై విహరిస్తూ.. భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన బ్రహ్మగరుడ సేవ ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. యాగశాలలోని శ్రీవారికి ఉదయం నిత్యపూజలు చేశారు. అనంతరం తిరువీధుల్లో విహరించారు. సంధ్యాసమయంలో శ్రీవారు గరుడారూడుడై తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు గరుడ పూజను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవానికి నారసింహుడి భక్తులు అత్యంత ప్రాధాన్యత ఇస్తా రు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిని నారసింహుడికి వాహనంగా పంపుతారని, గరుడుడిపై కొలువుదీరిన శ్రీవారిని తూర్పురాజగోపురంలో దర్శించుకుంటే మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. ఒక్క బ్రహ్మోత్సవాల్లోనే బ్రహ్మగరుడ సేవను నిర్వహిస్తారు. అందుకే శ్రీవారి దర్శనభాగ్యం కోసం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, తిరువీధులు కిక్కిరిసిపోయాయి. శ్రీవారికి ముందుభాగంలో జానపద కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆనాయితీ ప్రకారం స్థానిక మరకత మహాలక్ష్మి ఆలయం వారు శ్రీ వారికి పట్టువస్త్రాలను సమర్పించారు.



తూర్పు రాజగోపురంలో శ్రీవారిదర్శనం కోసం విచ్చేసిన భక్తులు

నేడు కదిరి పున్నమి

కదిరి పున్నమిగా పేరొందిన పౌర్ణమి రోజున శ్రీవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి మొక్కులను తీర్చుకుంటారు. కర్ణాటక, హిందూపురం, మదనపల్లి, తిరుపతి, రాయచోటి, పులివెందుల ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు.

నేడు శేషవాహన సేవ

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు శేషవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవానికి ఎనలేని ప్రాముఖ్యత ఉంది. బ్రహ్మోత్సవాల్లో అన్ని ఉత్సవాల్లో శ్రీవారు మాత్రమే తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామివారు తిరువీధుల్లో విహరిస్తారు.

నేటి నుంచి ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు



బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 6వరకు పరీక్షలు కొనసాగుతాయని విద్యాశాఖ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,750 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో పనిచేసే ఇన్విజిలేటర్లు, అధికారులు, సిబ్బంది సహా ఎవరూ మొబైల్ ఫోన్లు వాడకుండా నిషేధం విధించారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల లోపు 144వ సెక్షన్ ఆంక్షలు అమలులో ఉంటాయి. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లాలవారీగా స్పెషల్‌స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థులు కన్నడ, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, తమిళ, ఉర్దూ, మరాఠి సహా ఏడు భాషల్లో పరీక్షలు కొనసాగనున్నాయి. 4,41,910 మంది బాలురు, 4,28,058 బాలికలతో కలిపి మొత్తం 8,69,968 మంది పరీక్షలకు నమోదు చేసుకున్నారు. వీరిలో 8,10,368 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా 18,225మంది ప్రైవేట్ విద్యార్థులు, 41,375 మంది సప్లిమెంటరీ విద్యార్థులు ఉన్నారు. 5,424 మంది దివ్యాంగులు ఉన్నారు.



బీజేపీ, జేడీఎస్ పొత్తుతో మాకే

అనుకూలం


- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ పొత్తు పెట్టుకోవడం తమకే అనుకూలమని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. ఆదివారం మైసూరు విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ 28 స్థానాల్లో గెలుస్తారనేది అసాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 స్థానాల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని జోస్యం చెప్పారు. ఆ రెండు పార్టీల మధ్య పొత్తు కాంగ్రెస్ అభ్యర్థులకు అన్ని చోట్ల అనుకూలమే అన్నారు. ఏ విధంగా కలసి వస్తుందనేది బహిరంగంగా చెప్పలేమన్నారు. తాను మైసూరు, చామరాజనగర్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోలేదని, రాష్ట్రంలోని 28 నియోజకవర్గాలు తనకు కీలకమే అన్నారు. ఐదుగురు మంత్రుల పిల్లలకు టిక్కెట్లు ఇచ్చారనే బీజేపీ ఆరోపణలపై స్పందిస్తూ ప్రజాభిప్రాయం ప్రకారం ఇచ్చామన్నారు. ప్రజలు ఎవరికి ఎక్కువ మద్దతు పలికారో వారికి టిక్కెట్లు కేటాయించామన్నారు. ఇది కుటుంబ రాజకీయం కాదన్నారు. గుబ్బి ఎమ్మెల్యే శ్రీనివాస్ ఎక్కువ స్థానాలు గెలవకుంటే సీఎం రాజీనామా చేయాల్సి ఉంటుందనే వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నకు సమాధానంగా అంతకుముందు ఏం మాట్లాడరనేది కూడా పరిగణించాలని, ఒక వాక్యానికే ఆరోపణలు సరికాదన్నారు. పేదలపట్ల పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కూడా ఆయన కోరారన్నారు. నాలుగు స్థానాలకు అభ్యర్థుల ఎంపికలో ఎటువంటి వివాదాలు లేవని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. సీఎం వెంట మంత్రులు మహదేవప్ప, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

బీజేపీలో కేఆర్‌పీపీ విలీనం

- పార్టీ కార్యకర్తలతో సుదీర్ఘంగా చర్చించిన గాలి జనార్దనరెడ్డి
- నేడు ఢిల్లీలో బీజేపీలో చేరిక

బళ్లారి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాజీమంత్రి గాలి జనార్దన్‌రెడ్డి స్థాపించిన కల్యాణ రాజ్య ప్రగతి పక్ష (కేఆర్‌పీపీ)ని బీజేపీలో విలీనం చేస్తున్నారు. సోమవారం ఢిల్లీలో బీజేపీ పెద్దల సమక్షంలో పార్టీలో చేరేందుకు గాలి జనార్దనరెడ్డి సిద్ధమయ్యారు. ఈ మేరకు బెంగళూరులో ఆదివారం కేఆర్‌పీపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకున్నారు. బళ్లారి, గంగావతి, సండూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కేఆర్‌పీపీ కార్యకర్తలను జనార్దన్‌రెడ్డి పిలుపించుకుని సమావేశం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ పెద్దలు అమిత్‌షా, యడియూరప్ప, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర చర్చించారని, పార్టీని విలీనం చేయాలని సూచించారని తెలిపారు. బీజేపీ ఎంపీ అభ్యర్థుల విజయానికి పనిచేయాలని, బీజేపీలో గతంలో ఉన్న ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చినట్లు జనార్దనరెడ్డి కేఆర్‌పీపీ కార్యకర్తలతో చెప్పారు. ఇందుకు అక్కడ హాజరయిన కార్యకర్తలు కూడా అంగీకారం తెలిపారు. దీంతో గాలి జనార్దన్‌రెడ్డి సోమవారం బీజేపీలో చేరేందుకు ముహూర్తం ఖరారు చేసినట్లు చెప్పారు. ఇంత కాలం తనను నమ్మి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తాను ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాలి జనార్దనరెడ్డి సతీమణి గాలి లక్ష్మీ అరుణ మాట్లాడుతూ మీ రుణం తీర్చుకుంటానని తెలిపారు. బళ్లారి ఎమ్మెల్యే ఎన్నికల్లో కేఆర్‌పీపీ నుంచి పోటీ చేసిన తనకు స్థానిక ప్రజలతో పాటు కేఆర్‌పీపీ కార్యకర్తల అండదండలు అందించారని తెలిపారు. మీరందించిన ప్రోత్సాహాన్ని తాను ఎన్నటికీ మరవను అని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



మీడియాతో మాట్లాడుతున్న గాలి జనార్దనరెడ్డి


బ్రహ్మదేవుడు దిగి వచ్చినా

పోటీ నుంచి విరమించేది లేదు

- మాజీ ఉపముఖ్యమంత్రి ఈశ్వరప్ప
- బ్రహ్మ వచ్చి పోటీచేయరు : ప్రతిపక్షనేత అశోక్



బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మదేవుడు దిగి వచ్చినా లోక్‌సభ బరి నుంచి వెనుకడుగు వేసేది లేదని మాజీ ఉపముఖ్యమంత్రి ఈశ్వరప్ప స్పష్టం చేశారు. శివమొగ్గలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తన పోటీపై ఓటర్లలో గందరగోళం సృష్టించే ప్రయత్నం సాగుతోందని ఆరోపించారు. ఎవరు రాజీ చర్చలకు వచ్చినా విరమించే ప్రసక్తే లేదని, పోటీలో ఉంటానని తేల్చిచెప్పారు. టిక్కెట్ దక్కకపోవడంతో ఆవేదనలో ఉన్నానని అన్నారు. పార్టీజాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాగానీ, రాష్ట్ర నేత యడియూరప్పగానీ కనీసం ఫోన్‌లో పలకరించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను ఎవరికీ లొంగేది లేదన్నారు. రాష్ట్రంలో 27 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందుతారని, 28వ ఎంపీగా తాను గెలిచి నరేంద్రమోదీని మరోసారి ప్రధాని అయ్యేందుకు సహకరిస్తానని పేర్కొన్నారు. హిందూత్వవాదులు యడియూరప్ప కుటుంబానికి విరోధులు అన్నారు. కాంగ్రెస్, జేడీఎస్‌కు చెందిన ఎంతోమంది ముఖ్యులు వారి సిద్ధాంతాలను పక్కనపెట్టి సహకరిస్తామని భరోసా ఇచ్చారని తెలిపారు. ఈ తరహాలో సొంతపార్టీ వారు ఎందుకు వ్యవహరించలేదని ప్రశ్నించారు. ఈనెల 28న ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తానని తెలిపారు. ఐదుగురు హిందూ ప్రముఖులు కార్యాలయ ప్రారంభంలో పాల్గొంటారని చెప్పారు. 26న 11న గంటలకు శివమొగ్గ నగర, గ్రామీణలో బూత్‌స్థాయి కార్యక్రమం ఉంటుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీవై రాఘవేంద్ర ఓటమి ఖచ్చితమని, ఈ పరిణామంతోనే విజయేంద్ర పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుందని జోస్యం చెప్పారు. అప్పుడు కుటుంబాన్ని మాత్రమే వెనకేసుకొచ్చే ముఖ్యులనుంచి కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇదే విషయమై శివమొగ్గ బీజేపీ అభ్యర్థి రాఘవేంద్ర మీడియాతో మాట్లాడుతూ రెండు పార్టీ సిద్ధాంతాల మధ్య ఎన్నిక జరుగుతోందన్నారు. గీతా శివరాజ్, రాఘవేంద్ర మధ్య వ్యక్తిగత పోటీ కాదన్నారు. ప్రతిపక్షనేత ఆర్. అశోక్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ బ్రహ్మ వచ్చి ఎన్నికల్లో పోటీ చేయరని, అంతకుమించి వెనక్కి తీసుకోవాలని చెప్పరని ఈశ్వరప్ప వ్యాఖ్యలపై మండిపడ్డారు. బీజేపీకి కార్యకర్తలే బ్రహ్మలాంటివారని, వారిదే తుది నిర్ణయమని తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆనంద్‌గురూజీ శివమొగ్గలో ఈశ్వరప్పను భేటీ అయి మద్దతు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.79	1,591.48
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	1,207
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	844	8,620
సామర్థ్యం (టీఎంసీలు)	5.40	12.31

దిశ మార్చుకుంటున్న 'గాలి'

- 2022 డిసెంబరులో కేఆర్‌పీపీ ఆవిర్భావం
- నేడు బీజేపీలో విలీనం!

బళ్లారి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కల్యాణ రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) పార్టీని సోమవారం బీజేపీలో విలీనం చేయాలనుకోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కేవలం పార్టీ పెట్టి 15 నెలలు గడవకుండానే జెండా మాయంచేయాలనుకోవడం అభిమానుల్ని నిశ్చేష్టులను చేస్తోంది. గాలి జనార్దన్‌రెడ్డి కల్యాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీ(కేఆర్‌పీపీ)ని 25 డిసెంబరు 2022లో స్థాపించారు. ప్రారంభసమయంలో కల్యాణ కర్ణాటక జిల్లాల్లో ఈ పార్టీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని భావించారు. 2023 లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో బళ్లారి, గంగావతి, సిరుగుప్ప, సండూరు లాంటి నియోజకవర్గాల్లో పోటీ చేశారు. కానీ గంగావతిలో మాత్రమే పార్టీ అధ్యక్షుడు గాలి జనార్దన్‌రెడ్డి గెలిచారు. మిగిలిన చోట్ల అంతా ఓడిపోయారు. బళ్లారి నగరంలో గాలి జనార్దన్‌రెడ్డి భార్య లక్ష్మి అరుణ పోటీ చేసి సుమారు 70 వేల పైచిలుకు ఓట్లు సాధించి ద్వితీయస్థానంలో నిలిచారు. బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖర్‌రెడ్డి తృతీయస్థానంలో నిలిచారు. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా భరత్‌రెడ్డి 37 వేల పై చిలుకు ఓట్లతో గెలిచారు. కేఆర్‌పీపీ-బీజేపీ ఇద్దరూ విడిపోయి పోటీ పడడం వల్లే కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు మార్గం సులభం అయిందని చెప్పుకున్నారు. సోమవారం జనార్దన్‌రెడ్డితో పాటు, ఎంపీ అభ్యర్థి, ఆయన ప్రాణస్నేహితుడు శ్రీరాములు, ఆయన సోదరుడు, బళ్లారి మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి కూడా డిల్లీకి వెళ్లనున్నారు. అక్కడ అందరూ కలిసి పార్టీ పెద్దలతో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొత్తం మీద గాలి జనార్దన్‌రెడ్డి తిరిగి బీజేపీలో చేరితే పార్టీకి కొత్త ఊపు వస్తుందని కార్యకర్తలు పేర్కొంటున్నారు.



ఇక కనిపించని కేఆర్‌పీపీ గుర్తు ఇదే..

2, 3 తేదీలలో ఊరమ్మదేవి జాతర



కరపత్రాలు విడుదల చేస్తున్న సమితి అధ్యక్షులు

హొసపేట,మార్చి 24: దశబ్దాల చరిత్ర కలిగిన హొస్పేట గ్రామదేవత ఊరమ్మదేవి జాతర మహోత్సవం ఏప్రిల్ 2, 3 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ సమితి అధ్యక్షుడు బండే శ్రీనివాసులు తెలిపారు. హొస్పేటలోని గ్రామదేవత ఊరమ్మదేవి ఆలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఈజాతర జరుగుతుందని అయితే గత కొన్నేళ్ళుగా కరోనా మహమ్మారి కారణంగా జాతర నిర్వహించడం లేదన్నారు. అందువలన ఈ ఏడాది ఘనంగా జాతర నిర్వహించాలని ఆలయ జీర్ణోద్దరణ కమిటీ నిర్వయించిందన్నారు. జా తర సందర్భంగా మార్చి 26నుంచి ఏప్రిల్ 3వ తేది వరకు శ్రీచండి యాగం, దుర్గాదీపారాధన కన్నికాపూజ, తదితర వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఔత్సాహికులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా ఉపాధ్యక్షుడు గాలెప్ప, మారడి రమేశ్, బండి జంబన్న, తారిహళ్ళి వాసప్ప, బగాడి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూసీఐ అభ్యర్థికి మద్దతు పలకండి

బళ్లారి గాంధీనగర్, మార్చి 24: ఎన్నికలు ఉన్నా, లేకపోయినా ఎస్‌యూసీఐ(సి) పార్టీ నిరంతరంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూ వస్తోందని సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ ఉపాధ్యాయ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాంధీభవన్‌లో సమావేశం నిర్వహించారు. తమ పార్టీ పరంగా ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థికి సంపూర్ణ మద్దతు తెలపాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం జిల్లా సమితికి చెందిన దేవదాస్ మాట్లాడుతూ బీజేపీ కాంగ్రెస్‌తోపాటు అన్ని పార్టీలు ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. అనంతరం ఎస్‌యూసీఐ జిల్లా సమితి తరపున నాగలక్ష్మి మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు జనసామాన్యుల నుంచి ఓటుహక్కు అడిగే అర్హతను కోల్పోయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు డాక్టర్ ప్రమోద్, కామ్రెడ్ సోమశేఖర్ గౌడ, కె.శాంత, గోవిందు, జిల్లా సమితి సభ్యులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



కంప్లి, మార్చి 24 : రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పలుచోట్ల అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. కంప్లి కోట వద్ద, ఉప్పరహళ్లి, దరూరు వద్ద, బుక్కసాగర తదితర చోట్ల చెక్‌పోస్టుల వద్ద అధికారులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేని డబ్బు, ఇతర సామాగ్రి తరలించినట్లయితే స్వాధీనపరచుకుంటామని అధికారులు తెలిపారు.

నేడు కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామి రథోత్సవం

కంప్లి, మార్చి 24 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామి రథోత్సవం సోమవారం కన్నుల పండువగా జరుపుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఆలయం చుట్టూ తోరణాలు, విద్యుత్ దీపాలు సిద్ధం చేశారు. జిల్లాతో పాటు వేరే జిల్లాల నుంచి వచ్చే భక్తాదులకు కూడా అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే ప్రత్యేక బస్సులు తాగేనీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తులపై ఫిర్యాదు చేయండి

పట్టణంలో గానీ, గ్రామాల్లో గానీ ఇళ్ల చుట్టుపక్కల అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కంప్లి సీఐ ప్రకాష్ మాళి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు చోట్ల వివాహాలకు, శుభకార్యాలకు వెళ్లినప్పుడు ఇళ్లలో వున్న ఆభరణాలను బ్యాంకు లాకర్లో వుంచాలన్నారు.

కన్నడనాట మనుగడలేని ప్రాంతీయ పార్టీలు

- అప్పుడు బిఎస్ఆర్, కేజీపీ, ఇప్పుడు కేఆర్‌పీపీ

బళ్లారి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల మనుగడ కొద్దికాలానికే ముగిసిపోతోంది. ముఖ్యంగా 2013 నుండి 2023 వరకూ రాష్ట్రంలో కొత్తగా పుట్టుకొచ్చిన ప్రాంతీయ పార్టీలు నడపలేక మూసేశారు. 2013 ఎన్నికల ముందు కర్ణాటకలో మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప కేజీపీ పార్టీని పెట్టారు. అదే సమయంలో గాలి జనార్దన్‌రెడ్డి అండ్ టీం కలిసి బిఎస్ఆర్ అనే పార్టీని స్థాపించారు. ఈరెండు పార్టీలూ బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పాటు చేసినవే. కానీ 2013 ఎన్నికల తరువాత ఈ పార్టీల జెండా పీకేసి తిరిగి బీజేపీలోనే కలిపేశారు. ప్రస్తుతం ఇప్పుడు కూడా అంతే. 2022 డిసెంబరు 25న గాలి జనార్దన్‌రెడ్డి కేఆర్‌పీపీని స్థాపించారు. బీజేపీ తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదనే కారణంతోనే ఆయన కేఆర్‌పీపీని నెలకొల్పారు. అయితే సరిగ్గా 15 నెలలు గడవక ముందే గాలి జనార్దన్‌రెడ్డి కేఆర్‌పీపీని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. కర్ణాటకలో ప్రస్తుతం ఉన్న ప్రాంతీయ పార్టీల్లో మిగిలింది జేడీఎస్ మాత్రమే. అదికూడా కుంటినడక నడుస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రధానంగా కన్నడనాట ప్రసుత్త కాలంలో ప్రాంతీయ పార్టీలు నడపడం అంత సులభం కాదు అని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

వైభవంగా రంగనాథస్వామి, లక్ష్మీదేవి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కంప్లి, మార్చి 24 : విజయనగర జిల్లాలోని హగరి బొమ్మనళ్లి తాలుకా తంబ్రహళ్లి గ్రామంలో ప్రసిద్ది గాంచిన శ్రీ బడే రంగనాథస్వామి దేవస్థాన ఆవరణలో ఆదివారం రంగనాథస్వామి, లక్ష్మీదేవికి కల్యాణోత్సవం నిర్వహించారు. ప్రతి యేటా హోలీపౌర్ణమి ముందుగానే ఈ వేడుకలు జరుపుకుంటున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. ఈ నెల 26న రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవంలో హగరి బొమ్మనహళ్లితో పాటు మరెమ్మనహళ్లి, కొట్టూరు, కూడ్లిగి, హోస్పేట, తదితర పట్టణాల నుంచి భక్తులు పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి

బళ్లారి సిటీ,మార్చి 24: నగరంలోని శ్రీకృష్ణదేవరా విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు న్యాయం చేయాలని ఆదివారం మాజీ మంత్రి శ్రీరాములుకు కల్యాణ కర్ణాటక పదవీధర వేదిక వినతి పత్రం సమర్పించింది. ఈసందర్భంగా వేదిక అధ్యక్షులు శరణప్ప పాటిల్ మాట్లాడుతూ డిగ్రీ ఒకటవ సెమిస్టర్, మూడవ సెమిస్టర్ ఫలితాల్లో అవకతవకలు జరగడంతో ఏ సబ్జెక్టుకు పరీక్ష రుసుం కట్టాలో తెలియక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. 2,800 మంది విద్యార్థులు ఈసమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ రిజిస్టర్ రుద్రేశ్‌కు తెలపగా వారు సరైన సమాధానం ఇవ్వడంలేదని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

12 నుంచి కొప్పాళ లోక్‌సభ స్థానానికి నామినేషన్లు

సిరుగుప్ప, మార్చి 24 : ఏప్రిల్ 12 నుంచి కొప్పాళ లోక్‌సభ ఎన్నికల నామినేషన్ పర్వం ప్రారంభమవుతున్నట్లు ఎన్నికల అసిస్టెంట్ అధికారి డాక్టర్ ఎం తిరుమలేష తెలిపారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 12 నుంచి 19 వరకు నామినేషన్లు 20న పరిశీలన, 22వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ వుంటుందని ఆయన తెలిపారు. మే 7వ తేదీన పోలింగ్ జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. తాలుకాలోని 228 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తాలుకాలో 2,22,898 మంది ఓటర్లు వున్నట్లు ఆయన తెలిపారు. వికలాంగులకు, వయో వృద్దులకు ప్రత్యేకంగా ఓటు హక్కు వినియోగించుకోవడంపై ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు చోట్ల చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. 25 మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించినట్లు ఆయన తెలిపారు. రూ. 50 వేల పైన నగదు వుంటే వాటికి రశీదులు లేనిపక్షంలో వాటిని సీజ్ చేసి కేసు దాఖలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా సిరుగుప్ప తహసీల్దార్ షంషాలం, పంచాయతీ ఈవో పవన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర, పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎన్నికల అధికారి తిరుమలేశ

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన

సిరుగుప్ప, మార్చి 24 : తాలుకాలోని ఆగలూరు గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన బీజేపీ జిల్లా యూత్ అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప ఆధ్వర్యంలో జరిగింది. సిరుగుప్ప తాలుకాలోని ఆగలూరు, హోసళ్లి గ్రామంలో గ్రామ సర్కిల్ వద్ద వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ ఎంఎస్ సిద్దప్ప చేతుల మీదుగా జరిగింది. వాల్మీకి సమాజ ప్రముఖులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వాల్మీకికి మొక్కుతున్న ఎంఎస్ సిద్దప్ప

నెల తిరగకుండానే... రోడ్లపైకి నీరు



దుర్గమ్మ గుడి సర్కిల్‌లో కొత్తతారు రోడ్లపై నిలిచిన నీరు

బళ్లారి గాంధీనగర్, మార్చి 24: బళ్లారి నగరంలో దుర్గమ్మ గుడి సర్కిల్ అభివృద్ధికి కంకణం కట్టుకున్న స్థానిక ప్రజా ప్రతినిధులు రోడ్డు పనుల నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారనడానికి పైన కనిపిస్తున్న దృశ్యం అద్దం పడుతోంది. ఈ మధ్యనే శరవేగంగా సాగిన అభివృద్ధి పనులు చేపట్టడంలో కాంట్రాక్టరు నిర్లక్ష్యానికి రోడ్డుపైన నిలిచిన నీరే... నిదర్శనంగా నిలుస్తోంది. కార్పొరేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో నిర్మిస్తున్న రోడ్లు... నెలతిరగకుండానే... రూపురేఖలు మారడం ఏమిటని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోట్లాది రూపాయిలు ఖర్చు చేసి నిర్మిస్తున్న తారు రోడ్లు దెబ్బతినడం వెనుక కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

ఎండిన హరిగోల్ ఘాట్

8 రోజులకోసారి నీటి సరఫరా



తుంగభద్ర నదిలో ఎండిపోయిన హరిగోల్ ఘాట్

బళ్లారి సిటీ, మార్చి 24: జిల్లాలో ప్రవహించే తుంగభద్ర నదీ జలాశయం పూర్తిగా ఎండిపోయిందని, నగర పాలక సంస్థ తరపున 8 రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారని సిరుగుప్ప నగరవాసులు అంటున్నారు. గతంలో బళ్లారి తాలూకా దేశ్‌నూర్ గ్రామం వినాయక్ నగర్ సమీపంలోని తుంగభద్ర నదిలో హరిగోల్ ఘాట్ నుంచి నగరానికి తాగునీరు సరఫరా అయ్యేది. ఈ ఏడాది వేసవికి ముందే తుంగభద్ర నది ఎండిపోవడంతో సిరుగుప్ప తదితర ప్రాంతాల ప్రజలు నీటి కోసం నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని వివిధ వార్డులకు గొట్టపు బావుల నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. నగరంలో పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేయడంలో అధికారులు విఫలమయ్యారు. తుంగభద్ర నది హరిగోల్ ఘాట్ నుంచి మున్సిపాలిటీలోని జాక్‌వెల్‌కు 10హెచ్‌పీ సామర్థ్యం ఉన్న 5మోటార్లు ఏర్పాటు చేసినా వేసవిలో నీటి కొరత ఉండదు. నీటి సరఫరా కేంద్రంలో నీటి శుద్ధి సరిగా జరగడంలేదు. దీంతో ప్రజలు ఈ నీటిని తాగేందుకు వినియోగించడంలేదు. మున్సిపల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు పనిచేయకపోవడంతో ప్రైవేట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లపై ఆధారపడక తప్పడంలేదు. అధికారుల నిర్లక్ష్యం వలన ఇప్పటికీ పశువులు నీరులేక ఇబ్బందులు పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సిరుగుప్ప నగరంలో కొన్ని బోర్లు పనిచేయడం లేదని....మిగిలిన బోర్‌వెల్‌ల నుంచి రోజువారీ అవసరాలకు అవసరమైన నీటిని నేరుగా వదులుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల నీటి ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈఓ మనోజ్ కుమార్ మీనా

బళ్లారి సిటీ,మార్చి 24: రాష్ట్రంలో రెండు దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని, ఎన్నికల ప్రక్రియలో ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టాన్ని ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కమిషనర్లు, జిల్లాపోలీసు సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి శనివారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించగా, ఎన్నికలకు ఆటంకం కలిగించే సంఘవిద్రోహశక్తులపై నిఘా ఉంచాలని అన్ని జిల్లాల పోలీసు సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. అంతర్ రాష్ట్ర , అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద డేగకళ్లతో నిఘా ఉంచాలన్నారు. అక్రమ మద్యం, అక్రమంగా తరలిస్తున్న డబ్బు, విలువైన వస్తువులను స్వాధీనం చేసుకోవాలని, నిర్ణీత నమూనాలో నివేదిక సమర్పించాలని ఆయా జిల్లాల ఎన్నికల అధికారులను ఆయన ఆదేశించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా కేంద్రం భద్రతా బలగాలను మోహరించిందని, వారికి అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని తెలిపారు. చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సరిపడా విద్యుత్ వ్యవస్థ, మౌలిక వసతులు కల్పించాలన్నారు. అధిక సంఖ్యలో వాహనాల తనిఖీలు చేపట్టాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకుండా చూడాలని ఆయా జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాకు సంబంధించి ఇప్పటికే సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రాజ కీయ పార్టీ నేతల సమక్షంలో ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ మొదటి దశ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాపోలీసు సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు. జిల్లా స్వీప్ కమిటీ నోడల్ అధికారి, జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్‌శరణప్ప, డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా, అసిస్టెంట్ కమిషనర్ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్‌జుబేరా

హోసూరు జోన్

కృష్ణగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా గోపీనాథ్



గోపీనాథ్‌తో మాజీ సర్పంచ్ మురళీబాబు

హోసూరు, మార్చి 24: లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల విషయంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ అధిష్ఠానం ఒక్కసారిగా తన అభ్యర్థిని మార్పు చేసింది. సిట్టింగ్ ఎంపీ సెల్లకుమార్ పేరును తొలుత ప్రకటించగా.. తాజాగా మారిన రాజకీయాలతో మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ పేరును ప్రకటించారు. దీంతో గోపీనాథ్‌తో ఆదివారం పలువురు నాయకులు భేటీ అయి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా బాగలూరు మురళీ బాబు, ఆయన అనుచరులతో గోపీనాథ్‌ను భేటీ అయ్యారు. డీఎంకే నాయకులు కూడా గోపీనాథ్ విజయానికి పూర్తిగా సహకరిస్తామని ప్రకటించారు.

నేడు చంద్రచూడేశ్వరస్వామి రథోత్సవం

హోసూరు, మార్చి 24: హోసూరులో ప్రసిద్ధి చెందిన మరకతాంబ చంద్రచూడేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం జరగనుంది. ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వృషభ వాహనంపై స్వామివార్లను ఊరేగించారు. స్వామి వారికి రుద్రాభిషేకం, పుష్పాలంకరణ, తిరుకల్యాణం నిర్వహించిన అనంతరం పురవీధులలో ఊరేగింపు కొనసాగింది. బ్రహ్మరథోత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. హోసూరు కార్పొరేషన్ తరపున అన్ని భద్రతా ఏర్పాట్లు నిర్వహించారు.

మేకెదాటుకు మద్దతు ఇవ్వండి

హోసూరు, మార్చి 24: కావేరి నదికి అనుబంధంగా నిర్మిస్తున్న మేకెదాటుకు మద్దతు ఇవ్వాలని తమిళులను కన్నడ పోరాటనేత వాటాళ్ నాగరాజ్ కోరారు. సరిహద్దులోని అత్తిబెలెలో ఆదివారం కన్నడ సంఘాల నిరసనలో పాల్గొని మాట్లాడారు. సూపర్‌స్టార్ రజనీకాంత్, కమలహాసన్‌లు తమిళనాడు ముఖ్యమంత్రిని కలసి మెకెదాటును వ్యతిరేకించరాదని విన్నవించాలన్నారు. మేకెదాటుకు తమిళ సినీ పరిశ్రమ మద్దతు ఇవ్వాలని కోరారు. శాశ్వత తాగునీటికోసం ప్రతిపాదించిన మేకెదాటు పథకాన్ని అడ్డుకోరాదన్నారు. పలు క్లిష్ట పరిస్థితుల్లోనూ కరువు నెలకొన్న తరుణంలోనూ కర్ణాటక నుంచి తమిళనాడుకు కావేరినీటిని విడుదల చేస్తున్నారని అయినా మేకెదాటుపథకాన్ని ఎందుకు వ్యతిరేకిస్తారని ప్రశ్నించారు. తీరుమార్చుకోకుంటే పోరాటం చేస్తామన్నారు. నిరసనలో పెద్దసంఖ్యలో కన్నడసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి: కలెక్టర్

హోసూరు, మార్చి 24: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్ సరయు పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలలో భరోసా కల్పించేలా ఆదివారం హోసూరు నగరంలో పోలీసుల పథసంచలనం సాగింది. రాంనగర్‌లోని అన్నా విగ్రహం నుంచి పోలీసుల కవాతు ప్రారంభమై పాత బెంగళూరు రోడ్డు, గాంధీ రోడ్డు, బాగలూరు రోడ్డు, తాలూకా ఆఫీసు రోడ్డు మీదుగా సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సరయు, ఎస్పీ తంగదురై, కమీషనర్ స్నేహ, డీఎస్‌పీ బాబు ప్రశాంత్‌లు కవాతును ప్రారంభించారు. ర్యాలీలో సీఐలు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు, తమిళనాడు స్పెషల్ పోలీసులు, పెద్దసంఖ్యలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో కలెక్టర్ సరయు

బాలిక దత్తతపై కాచాపురలో విచారణ



బిగ్‌బాస్ నటి సోనుగౌడ(ఫైల్) ఆమెను విచారణ కోసం కాచాపుర గ్రామానికి తీసుకువస్తున్న పోలీసులు

రాయచూరు, మార్చి 24 : మైనర్ బాలికను నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకున్నారన్న అంశానికి సంబంధించి నిందితురాలు, బిగ్‌బాస్ టీవీ సీరియల్ నటి సోనుగౌడను ఆదివారం పోలీసులు విచారణ చేపట్టారు. జిల్లాలోని మస్కి తాలూకా కాచాపుర గ్రామానికి చేరుకున్న బెంగళూరులోని బ్యాడరహళ్ళి పోలీసులు బాలిక పుట్టిపెరిగిన ఇళ్లు, తిరుగాడిన పరిసరాలు, బంధువులను విచారించేందుకు వచ్చారు. ఇప్పటికే పోలీస్ కస్టడీలో ఉన్న సోనుగౌడను వెంట తీసుకొచ్చిన పోలీసులు ఆమె ఎదురుగానే బాలిక తాత, ఇతర బంధువుల నుంచి పలు విషయాలను రాబట్టారు. బాలికను ఇటీవల దత్తత తీసుకున్నారన్న ఆరోపణ మేరకు నటి సోనుగౌడపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెంగళూరులోని బ్యాడరహళ్ళి పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా విచారణ సందర్భంగా సోనుగౌడను పలు విధాల గ్రామస్థులు ప్రశ్నించడంతో ఆమె సమాధానం చెప్పలేకపోయినట్లు తెలిసింది. ఈ క్రమంలో కొంతమంది యువకులు ఆమె పై దాడి చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆమెను వాహనంలో కూర్చోబెట్టి అక్కడ నుంచి తరలించుకువెళ్లారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

రాయచూరు, మార్చి 24 : లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ విడుదల కాగా జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నట్లు జిల్లా ఎస్పీ బి.నిఖిల్ తెలిపారు. శాంతిభద్రతలతో పాటు ఎలాంటి హింసాత్మక సంఘటనలకు తావు లేకుండా పోలీసులు తమ విధులను మరింత అప్రమత్తంగా నిర్వహించాలని సూచించారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ స్టేషన్ల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.



పోలీస్‌అధికారులతో సమావేశమైన ఎస్పీ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయిన్...

దువ్వూరి వేంకటరమణ శాస్త్రి (జయంతి)



సుప్రసిద్ధ సంస్కృతాంధ్ర పండితుడు, కళాప్రపూర్ణ గ్రహీత దువ్వూరి వెంకటరమణ శాస్త్రి 1897 మార్చి 25న తూర్పు గోదావరి జిల్లాలో మసకపల్లిలో జన్మించారు. వీరి పూర్వీకులు నెల్లూరు జిల్లాలోని దువ్వూరి ప్రాంత వాసులై క్రమేణా గోదావరి జిల్లాకు చేరారు. ఆరు దశాబ్దాలపాటు తెలుగు అధ్యాపకులుగా వ్యవహరించారు. చక్కటి దస్తూరి ఆయన ప్రత్యేకత. వ్యాకరణాన్ని సులభంగా బోధించేవారు. తెలుగు సాహిత్యం, ఉపాధ్యాయ ప్రముఖులపై స్వీయచరిత్రను రాయడం విశేషం. 1972లో కన్నుమూశారు.

నార్మన్ బోర్లాగ్ (జయంతి)



నోబెల్ శాంతి పురస్కార గ్రహీత నార్మన్ ఎర్నెస్ట్ బోర్లాగ్ 1914 మార్చి 25న అమెరికా దేశం అయోవాలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. హరిత విప్లవ పితామహుడిగా పేరొందారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందిని ఆకలి బాధల నుంచి, పస్తులనుంచి రక్షించిన వ్యక్తి. తొలుత చీడపీడలనుంచి తట్టుకునేలా గోధుమ వంగడాలను సృష్టించారు. 1960 ప్రాంతంలో ఇండియా, పాకిస్థాన్ దేశాలకు వంగడాలను పరి చయం చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 18.7 కోట్ల ఎకరా లలో ఆయన వంగడాలను వాడుతున్నారు. 2006లో ఆయనపై 'ది మ్యాన్ హూ ఫెడ్ ది వరల్డ్' అనే పుస్త కం వచ్చింది. 2009 సెప్టెంబరు 12న కన్నుమూశారు.

ఎస్ఎం పండిత్ (జయంతి)



డాక్టర్ ఎస్ఎం పండిత్ 1916 మార్చి 25న కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలో జన్మించారు. పేరొందిన చిత్రకారుడు. పురాణాల సన్నివేశాలకు అనుగుణంగా గీసిన చిత్రాలు పేరొందాయి. రాధాకృష్ణ, నల దమయంతి, విశ్వామిత్ర మేనక తదితర పాత్రల కళాఖండాలు ప్రసి ద్ధి చెందాయి. మహాత్మాగాంధీ, స్వామి వివేకానందల భారీ చిత్తరువులు ప్రస్తుతం ముంబైలోని కౌన్సిల్ హాల్ లో ఉన్నాయి. లండన్‌లోని రాయల్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ కు ఎంపికై ప్రదర్శనలు ఇచ్చారు. రాజ్యోత్సవ, గౌరవ డాక్టరేట్ సహా పలు అవార్డులు పొందారు. 1993 మార్చి 30న కన్నుమూశారు. కొన్ని ప్రముఖ కళాఖం డాలు గుల్బర్గాలోని గ్యాలరీలో ఉన్నాయి.

ఫారూక్ షేక్ (జయంతి)



ప్రముఖ హిందీ నటుడు ఫారూక్ షేక్ 1948 మార్చి 25న గుజరాత్ రాష్ట్రం వడోదరలో జన్మించారు. బుల్లితెర వ్యాఖ్యాత, మానవతా వాదిగా గుర్తింపు పొందారు. సత్యజిత్ రే, హృషికేశ్ ముఖర్జీ, కేతాన్ మెహతా వంటి దర్శకులతో పనిచేశారు. మూస సినిమాలను పక్కనపెట్టి కొత్త తరహా సినిమాలకోసం నాంది పలికి విజయం సాధించారు. బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా 2010లో నేషనల్ ఫిల్మ్ అవార్డ్ అందుకున్నారు. సినీరంగంలో 1977-89ల మధ్య తనదైన ముద్రను చాటారు. 2013 డిసెంబరు 28న కన్నుమూశారు.

సుబ్బరామన్ విజయలక్ష్మి (పుట్టినరోజు)



చదరంగంలో అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన సుబ్బరామన్ విజయలక్ష్మి 1979 మార్చి 25న మద్రాస్‌లో జన్మించారు. ఇంటర్నేషనల్ మాస్టర్, ఉమన్ గ్రాండ్ మాస్టర్, ఫైడ్ టైటిల్స్ పొందారు. చెస్ ఒలింపియాడ్‌లో ఈ టైటిల్ సాధించిన తొలి మహిళగా గుర్తింపు పొందారు. 2001లో 'అర్జున' అవార్డు సాధించారు. అన్ని వయస్సుల విభాగాలలో పోటీ పడి ఇంటర్నేషనల్ మాస్టర్‌గా గుర్తింపు పొందారు. 2016లో 8వ చెన్నై ఓపెన్‌లో రష్యన్ గ్రాండ్ మాస్టర్ బోరిస్ గ్రచేవ్‌తో తలపడి టైగా నిలిచారు. కాగా ఇండియన్ గ్రాండ్ మాస్టర్ శ్రీరామ్ ఝాను పెళ్లి చేసుకున్నారు.

ఉత్సాహంగా శిక్షణ తరగతులు



సదస్సులో ప్రముఖులు

బొమ్మనహళ్ళి, మార్చి 24: ఎలక్ట్రానిక్‌సిటీలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బెంగళూరులో రీసెర్చ్ ఇన్నోవేషన్ సొసైటీ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఆర్ఐఎస్ఈ) లో పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలపై శుక్ర, శనివారాలలో శిక్షణా తరగతులు ఉత్సాహంగా సాగాయి. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ దేబబ్రతదాస్ ప్రసంగిస్తూ పారిశ్రామిక రంగంలో రాణించేందుకు దోహదపడేలా తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. ఐఐటీ ప్రొఫెసర్ రాజగోపాలన్ సదస్సులో కీలక ప్రసంగం చేశారు. సంజయ్‌గోపినాథ్, అమిత్ చటర్జీ తదితరులు పాల్గొన్నారు. కంప్యూటర్ నెట్‌వర్క్, సాంకేతిక రంగంలో మెలకువలపై పలువురు ప్రసంగించారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



ఉత్సవంలో ఎమ్మెల్యేలు తదితరులు

విజయనగర, మార్చి 24: విజయనగర నియోజకవర్గంలోని అత్తిగుప్పెలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మరథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ఎం కృష్ణప్ప, గోవిందరాజనగర ఎమ్మెల్యే ప్రియాకృష్ణ ముఖ్యులుగా పాల్గొని రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పురవీధులగుండా సాగిన రథోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ.. రైళ్లలోనూ పోలీసుల సోదాలు



లగేజీలను తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రభావం రైలు ప్రయాణీకులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రైల్వే పోలీసులు అలెర్ట్ అయ్యారు. ఆర్‌పీఎఫ్, రైల్వే పోలీసులు నిత్యం సోదాలు పెంచారు. వివిధ రాష్ట్రాలనుంచి బెంగళూరుకు వచ్చే వందలాది రైళ్లను పరిశీలిస్తున్నారు. ప్రతిచోటా బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బెంగళూరు నుంచి బయల్దేరే రైళ్లతోపాటు ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే రైళ్ల అన్ని బోగీలలోనూ లగేజీలను పరిశీలిస్తున్నారు. ఆర్‌పీఎఫ్, రైల్వే పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సోదాలు చేస్తున్నారు. నాలుగు రోజులుగా అన్ని ప్రధాన రైల్వే స్టేషన్‌లలోనూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ప్రతి ప్రయాణీకుడి లగేజీని తనిఖీలు చేస్తున్నారు.

ఓటు హక్కుపై బైక్ ర్యాలీ

శిడ్లఘట్ట, మార్చి 24: లోక్‌సభ ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దారు స్వామి పిలుపునిచ్చారు. తాలూకా స్వీప్ సమితి, విద్యాశాఖ ఆధ్వర్యంలో నెహ్రూ క్రీడామైదానంలో ఆదివారం ఓటు హక్కుపై జాగృతి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు స్వామి మాట్లాడుతూ 18ఏళ్ల పైబడినవారంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా వందశాతం పోలింగ్‌కు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా బీఈఓ నరేంద్రకుమార్, అక్షరదాసోహ సహాయక డైరెక్టర్ ఆంజనేయ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు బీఆర్ నారాయణస్వామి, విద్యాశాఖ భాస్కర్ రెడ్డి, ఎన్‌పీఎస్ తాలూకా అధ్యక్షుడు గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



బైక్‌ర్యాలీలో తహసీల్దారు స్వామి తదితరులు

మండ్యలో సాహిత్య సమ్మేళనం వాయిదా తప్పదా..?

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు ఎన్నికలు వస్తున్న తరుణంలో మండ్యలో జరగాల్సిన అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం వాయిదా పడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో కన్నడ సంస్కృతిశాఖ నిర్వహించే సాహిత్య సమ్మేళనం కొనసాగించరాదు. మండ్యలో 86వ సమ్మేళనం జరిపేలా ఏడాదిక్రితమే నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ మే 15వరకు కొనసాగనుంది. దీంతో జూన్ 7 నుంచి మూడు రోజులపాటు అక్షరజాతర సాహిత్య సమ్మేళనం నిర్వహించదలిచారు. లోక్‌సభ ఎన్నికలు రాష్ట్రంలో ఏప్రిల్ 26, మే 7వ తేదీలలో జరగనున్నాయి. మే 15 నాటికి రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. అయితే జూన్ 4న కౌంటింగ్ ఉండడంతో అప్పటివరకు నిబంధనలు అమలులో ఉంటాయి. జూన్ 30లోగా పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసేలోగానే ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. దీంతో వాయిదా వేయాల్సి వస్తుంది. 2023 నవంబరు లేదా డిసెంబరులో మండ్యలో సమ్మేళనం నిర్వహించాలని భావించారు. పలు కారణాలతో సాధ్యం కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో చేయాలని భావించారు. ఇందుకు కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మహేశ్‌జోషి కసరత్తు జరిపారు. అయితే పలు కారణాలు అడ్డంకి అయ్యాయి. ఇలా రెండుసార్లు వాయిదా పడగా ప్రస్తుతం ఎన్నికల కోడ్‌తో ఐదారు నెలలపాటు జాప్యమైంది. 30ఏళ్ల తర్వాత మండ్యలో సాహిత్య సమ్మేళనం జరుగుతోంది. 1994 ఫిబ్రవరిలో 63వ సమ్మేళనం జరిగింది. ఆ తర్వాత మండ్యలో కొనసాగేలా నిర్ణయించారు. అయితే పలు అడ్డంకుల రావడంతో అక్షరజాతర వాయిదా పడుతోంది.


ఎక్కువ స్థానాలు గెలవకుంటే సిద్దరామయ్య రాజీనామా

- కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్ఆర్ శ్రీనివాస్

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్నామని, లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువస్థానాలు గెలవకుంటే సీఎం పదవికి సిద్దరామయ్య రాజీనామా చేయాల్సి ఉంటుందని తుమకూరు జిల్లా గుబ్బి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్ఆర్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. తిపటూరులో కాంగ్రెస్ ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ సిద్దరామయ్యతోపాటు కాంగ్రెస్ పార్టీ శక్తివంతం కావాలంటే కార్యకర్తలు ఇంటింటా వెళ్లి మద్దతు సాధించాలన్నారు. పారదర్శకంగా పేదలు, అట్టడుగు వర్గాల తరపున సిద్దరామయ్య ఎంతో పని చేస్తున్నారన్నారు. ఇదే విషయమై ప్రతిపక్షనేత అశోక్ స్పందిస్తూ వారికి శత్రువులు కాంగ్రెస్‌లోనే ఉన్నారన్నారు. ఎక్కువస్థానాలు గెలవకుంటే సీఎం పదవికి సిద్దరామయ్య రాజీనామా చేయాలనే డిమాండ్ ఏమని అర్థం చేసుకోవాలన్నారు. సీఎంను లాగేసేందుకు ఎన్నో ప్రయత్నాలు సాగుతున్నాయని, అక్కడ ఐదుమంది షాడో సీఎంలు ఉన్నారన్నారు. డీకే శివకుమార్, బీకే హరిప్రసాద్‌లు నిరంతరంగా సిద్దరామయ్యకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారని అదే విషయాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్ చెప్పారన్నారు.

ప్రధాని నుంచి ప్రశంసాపత్రం

శిడ్లఘట్ట, మార్చి 24: పట్టణంలోని ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి హెచ్‌సీ మునిరాజ్‌కు ప్రధాని నరేంద్రమోదీ నుంచి ప్రశంసాపత్రం అందింది. ప్రధాని పరీక్షా చర్చా కార్యక్రమంలో ఉత్తమ సలహా సూచన ఇచ్చినందుకు శిడ్లఘట్ట పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్, ఎన్ఎస్ఎస్ అధికారి మునిరాజ్‌కు అభినందనా ప్రశంసాపత్రం లభించింది. ఈ విషయాన్ని ఆదివారం ఆయన మీడియాకు తెలిపారు. పరీక్షలపై చర్చలో భాగంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు పరీక్షా వ్యవస్థలో పలు ఆధునిక విధానాలపై సలహా సూచనలు చేశారు. ఇందులో ఉత్తమ సలహా సూచన చేసిన అందరికీ ప్రధాని నరేంద్రమోదీ సంతకం చేసిన అభినందనాపత్రాలు లభించాయన్నారు. ఈ సందర్భంగా గ్రహీతలలో మునిరాజ్ కూడా ఉండడం అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రశంసాపత్రంతో మునిరాజ్

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలకు సన్నాహాలు పూర్తి



మీడియాతో బీఈఓ తనుజా

బాగేపల్లి, మార్చి 24: ఎస్ఎస్ఎల్‌సీ 2024 వార్షిక పరీక్షలకు అన్ని సన్నాహాలు పూర్తి చేసినట్టు బీఈఓ తనుజా వెల్లడించారు. బీఈఓ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈనెల 25 నుంచి ఏప్రిల్ 6వరకు పరీక్షలు ఉంటా యన్నారు. తాలూకాలో 2464మంది పరీక్షలకు నమోదు చేసుకున్నారన్నారు. బాలురు 1254, బాలికలు 1210మంది ఉన్నారన్నారు. తాలూకాలో 9 పరీక్షా కేంద్రాలు ఉన్నాయని బాగేపల్లిలో 4, గూళూరులో 1, పాతపాళ్యలో 1, మిట్టేమరిలో 1, చేళూరులో 2 కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. నేలపై కూర్చుని రాసే విధానాన్ని నిషేధించబడిందని, అన్ని చోట్ల బెంచీల వ్యవస్థ కల్పించా మన్నారు. పరీక్షా కేంద్రాలకు 200మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని సూచించారు.

అభ్యర్థి ఎవరైనా పార్టీ విజయానికి పాటుపడతాం

- ఎమ్మెల్యే నారాయణస్వామి



మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, మార్చి 24: లోక్‌సభ ఎన్నికల్లో కోలారు రిజర్వు స్థానానికి కాంగ్రెస్ నుంచి అభ్యర్థి ఎవరు పోటీ చేసినా పార్టీ విజయం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి వెల్లడించారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా మోదీ హవా కనిపించడం లేదని, ఇది కేవలం మీడియా సృష్టేనన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ పథకాలను ధ్వజమెత్తిన ప్రధాని మోదీ ఇప్పుడు వీటినే మోదీ గ్యారెంటీలుగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. 70ఏళ్ల సుదీర్ఘపాలనలో దేశంలో అప్పులు రూ.53వేల కోట్లు ఉండగా, ప్రధాని మోదీ పదేళ్లలో రూ.1.83 లక్షల కోట్లు చేశారని ఇదేనా అభివృద్ధి అంటూ ప్రశ్నించారు. కాగా సిట్టింగ్ ఎంపీ మునిస్వామి రాజకీయం కాంగ్రెస్‌తో ఆరంభమైందని, అయితే పలు కారణాలతో బీజేపీలో చేరారన్నారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్ దక్కనందుకు జేడీఎస్‌లో చేరే యత్నం చేస్తున్నారని ఆయన ద్వంద్వ తీరుకు ఇదే నిదర్శనమన్నారు. కాగా యరగోల్ జలాశయం ప్రారంభంతో నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటిని సమకూరుస్తున్నామని వేసవిలో నీటి ఎద్దడి ఉండదన్న విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. ఇప్పుడు రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. తాము చేసిన అభివృద్ధిని గమనించి ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను గెలిపిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాలగౌడ, పిచ్చహళ్ళి గోవిందరాజు, పురసభ సభ్యుడు షంషుద్దీన్‌బాబు, బూదికోటె బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జింకను రక్షించిన గ్రామస్థులు



జింకతో గ్రామస్థులు

బాగేపల్లి, మార్చి 24: అడవినుంచి వచ్చిన జింకను వీధి కుక్కలు తరుముతుండగా గమనించిన గ్రామస్థులు రక్షించారు. తాలూకాలోని కొత్తకోటె గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లాలపల్లిలో ఆదివారం తెల్లవారుజామున జింక ఒకటి ఆహారం కోసం గ్రామంలోకి వచ్చింది. కొన్ని వీధికుక్కలు జింకను తరుముతుండడాన్ని గ్రామస్థులు గమనించారు. కుక్కలను తరిమి జింకను రక్షించారు. జింకకు అవసరమైన మేత, నీరు అందించారు. విషయాన్ని అటవీశాఖ సిబ్బంది దృష్టికి తెచ్చారు. అటవీశాఖకు చెందిన గార్డు శ్రీరామప్ప, వాచర్ కదిరప్పలు చేరుకుని జింకకు ప్రథమ చికిత్స చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన డీవైఎఫ్ఐ ముఖ్యుడు హుసేన్ మాట్లాడుతూ గ్రామ శివార్లలో క్వారీల కారణంగా వన్యజీవులకు సమస్యలు ఎదురవుతున్నా యన్నారు. ప్రత్యేకించి వేసవిలో వాటికి కనీసమైన మేత, నీరు అందేలా చూడాలన్నారు. కాగా గార్డు శ్రీరామప్ప మాట్లాడుతూ వీధికుక్కల బారినుంచి జింకను కాపాడిన గ్రామస్థులను అభినందించారు. జింక బెదరిపోయిందని, గాయాలకు మందులు వేసినట్టు తెలిపారు. జింకను కొత్తకోటె సమీపంలోని అటవీప్రాంతంలో వదలనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వెంకటరామప్ప, ఖాసింసాబ్, సత్యప్ప, మూర్తి, హుసేన్, నాగరాజ కుమార, బాలచంద్ర, దాసప్ప, ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాన్ని గుర్తించాలి

బొమ్మనహళ్ళి, మార్చి 24: విద్యార్థులలో దాగియున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, అలాగే వారికి ఏ అంశంలో ఆసక్తి ఉందో గుర్తించాలని సినీనటుడు గరుడారామ్ పేర్కొన్నారు. హొంగసంద్రలోని సెయింట్ అమాస్ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. డ్యాన్స్, పాటలపై ఆసక్తి కల్గిన నన్ను తల్లిదండ్రులు ఎంతగానో ప్రోత్సహించారన్నారు. కేవలం విద్య ఒక్కటే కాక ఆట పాటల్లోని వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే వారు జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు వీలు కాగలదని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పలు అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. విద్యార్థుల డ్యాన్స్, మిమిక్రీ, ఫ్యాషన్‌షో సభికులను అలరించాయి. పాఠశాల ముఖ్యులు వరుణ్‌దేవరాజ్‌ను గరుడారామ్ అభినందించారు. కార్యక్రమంలో సినీ నటి రతికా సురేశ్, అశ్విని, బిగ్‌బాస్ ఫేం లోకేశ్‌కుమార్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో నటుడు గరుడా రామ్

జంటహత్యల కేసు సూత్రధారి అరెస్టు

- ఛేదించిన విజయపుర పోలీసులు



నిందితుడు సాగరనాయక్, హతులు (ఫైల్)

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రిందట విజయపురలో చోటు చేసుకున్న జంటహత్యల కేసును పోలీసులు శనివారం ఛేదించారు. విజయపుర జిల్లా తికోట తాలూకా సిద్ధాపుర గ్రామంలో 2023 మార్చి 19న రెండు సంచులలో మృతదేహాలు గుర్తించారు. ఇందులో ఓ మహిళ, 13 ఏళ్లబాలుడి శవాలను వెలికితీశారు. ఎక్కడా ఆనవాళ్లు లభించకపోవడంతో పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేశారు. మృతదేహాలు హత్య జరిగిన వారం రోజుల తర్వాత బయటపడ్డంతో కుళ్లిపోగా మరిన్ని ఆధారాలు లభించలేదు. ఉత్తరభారత్ వాసులు ఎక్కడో హతమార్చి ఇక్కడ పడేసి ఉంటారని భావించారు. విజయపురకు చెందిన సాగర నాయక్ కొంతకాలం మైసూరులో నివసించేవారు. ఇదే సందర్భంలోనే అదే ప్రాంతానికి చెందిన శృతి (35)తో స్నేహం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధంగా మారింది. కొంతకాలం తర్వాత సాగరనాయక్ సొంతూరు విజయపురకు వెనుతిరిగి వెళ్లాడు. ఎన్నిరోజులైనా సాగరనాయక్ స్పందించకపోవడంతో శృతి, 13ఏళ్ల కుమారుడు రోహన్‌తో కలసి 2023 మార్చి 13న విజయపురకు వెళ్లింది. సాగరనాయక్‌ను కలిశారు. 4వే లాడ్జిలో ఆమెను ఉంచారు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో సాగరనాయక్ శృతి గొంతు నులిమి హతమార్చాడు. ఎప్పుడైనా రోహన్ ద్వారా హత్య విషయం బయటపడవచ్చునని అతడిని కూడా హతమార్చాడు. ఆ తర్వాత సాగరనాయక్ మిత్రుడు లక్ష్మీకాంత్ కుంబారతో కలసి శృతి తీసుకొచ్చిన రెండు లగేజీ బ్యాగులను ఖాళీ చేసి వాటిలోనే మృతదేహాలను ఉంచి స్కార్పియో వాహనం ద్వారా తరలించారు. మహారాష్ట్ర సరిహద్దులోని సిద్ధాపుర గ్రామంలోని ఓ కాలువలో పడేశారు. శృతి, రోహన్‌లు కనిపించకపోవడంపై మైసూరులో కేసు నమోదైంది. కేసులు పరిశీలించేవేళ విజయపురలో లభించిన రెండు మృతదేహాలకు మైసూరులో కనిపించకుండా పోయిన ఇరువురితో సంబంధం ఉండవచ్చునని పరిశీలించారు. ఆమె ఫేస్‌బుక్ ద్వారా ఎవరెవరు మిత్రులు ఉన్నారనే కోణంలో పోలీసులు పరిశీలించారు. ఏడాదిక్రితం వీరిద్దరూ ఫేస్‌బుక్ ద్వారా పలు విషయాలు, ఫోటోలు షేర్ చేసుకున్నారు. అనుమానంతో విజయపుర సాయి పార్క్ నివాసి సాగరనాయక్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. తమదైన శైలిలో సమగ్ర విచారణ జరపగా జంటహత్యల విషయాన్ని అంగీకరించాడని పోలీసులు తెలిపారు.

440 రౌడీషీటర్ల నివాసాలపై దాడి

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ, సెంట్రల్ విభాగం డీసీపీల పర్యవేక్షణలో రౌడీ షీటర్ల నివాసాలపై పోలీసులు శనివారం దాడులు జరిపారు. పలువురు ఇళ్లనుంచి మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమవిభాగంలో ఉప్పారపేట, సిటీ మార్కెట్, కాటన్‌పేట్, చామరాజపేట, బ్యాటరాయనపుర, చంద్రాలే అవుట్, జేజే నగర్, ఆర్‌నగర్, జ్ఞానభారతి, కెంగేరి, విజయనగర, గోవిందరాజనగర, మాగడి రోడ్డు, బసవేశ్వర నగర ప్రాంతాలలో దాడులు జరిపారు. 326 మంది రౌడీషీటర్ల నివాసాలపై దాడి చేసి పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. 231మంది అందుబాటులో ఉండగా 95మంది ఆచూకీ తెలియరాలేదు. ఇక సెంట్రల్ విభాగంలో 113మంది రౌడీల నివాసాలపై దాడులు చేసినట్టు డీసీపీ శేఖర్ తెలిపారు.

పోలీసు అధికారి ముసుగులో మోసం : యువతి అరెస్టు

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారి వేషంలో మోసాలకు పాల్పడిన హొసన్ నగరం విజయనగర లే అవుట్‌కు చెందిన నివేదితను ఆదివారం అరెస్టు చేశారు. రామనగర జిల్లా మాగడి తాలూకా లక్కేనహళ్ళికి చెందిన నివేదిత పోలీసు యూనిఫాంలో వెళ్లి బెదరింపులకు పాల్పడి మోసం చేస్తుండేవారు. కవనకు ఆగలహళ్ళి గ్రామానికి చెందిన సునిల్‌తో నాలుగునెలలక్రితం వివాహమైంది. ఇరువురి మధ్యన విబేధాలు తలెత్తాయి. సునిల్ ఇదే విషయమై నివేదితకు సమాచారం ఇచ్చాడు. నివేదిత పోలీస్ యూనిఫాంలో కవన ఇంటికి వెళ్లి తాను ఎస్పీ అంటూ పరిచయం చేసుకున్నారు. విచారణకు వచ్చానని బెదరింపులకు పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేస్తానని, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సునిల్‌ను కవన ఇంటికి రప్పించారు. వెంటనే విడాకులు తీసుకోవాలని లేనిపక్షంలో తీవ్రమైన సెక్షన్‌లకింద కేసు నమోదు చేస్తానని బెదరించారు. భయపడిన కవన 20 గ్రాముల బంగారం నెక్లెస్, 10 గ్రాముల ఉంగరం, 2వేల నగదు ఇచ్చారు. అయితే కవనకు అనుమానం రావడంతో కుటుంబ సభ్యులతో కలసి పెన్షన్ మొహల్లా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పలువురికి కవన మోసం చేశారని గాలింపులు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. పోలీసు అధికారిగా భావించి పలు విద్యాసంస్థలు నివేదితను ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. యూనిఫాంలోనే వెళ్లి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మరో సహకారబ్యాంకులో అవినీతి


బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో మరో కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకులో అవినీతి శనివారం బహిరంగమైంది. నాగపుర క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలో అవినీతి చోటు చేసుకున్న విషయమై సభ్యుడు సురేశ్ ఈనెల 15న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సహకార సంఘాల జాయింట్ డైరెక్టర్ రెండు నెలల్లో విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. సొసైటీ పాలక మండలి, సీఈఓలు సంయుక్తంగా అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. సీఈఓ, సిబ్బంది రుణాల వసూళ్ల విషయంలో దుర్వినియోగానికి పాల్పడ్డారని, చెక్ డిస్కౌంట్, స్థిరాస్తులపై రుణం ఇచ్చేవేళ నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలు ఉన్నాయి. నాగపుర క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ నగరంలో 3శాఖలు ఉన్నాయి. 9వేలమంది డిపాజిట్‌లు చేశారు. ఇటీవల అవినీతి తారస్థాయికి చేరిందని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించకపోతే పలు సహకార సంస్థలు మూతపడిన రీతిలోనే నాగపుర సొసైటీ కూడా చేరుతుందని ఆరోపించారు.

కుక్కే సుబ్రహ్మణ్య ప్రాంతంలో మావోయిస్టులు

- ఓ ఇంటికొచ్చి మొబైల్ చార్జింగ్

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా కడబ తాలూకా కుక్కె సుబ్రహ్మణ్య పరిధిలోని ఐనకిదు గ్రామానికి అనుబంధమైన కోటె తోట ప్రాంతంలో శనివారం సాయంత్రం మావోయిస్టులు వచ్చినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నలుగురైదుగురు వ్యక్తులు కోటె తోటకు వచ్చి గ్రామంలోని ఓ ఇంటికి వెళ్లారు. అక్కడ గంట సమయంపాటు గడిపారు. మొబైల్‌ను చార్జింగ్ చేసుకున్నట్టు తెలుస్తోంది. సాయంత్రం 6 గంటలకు వర్షం కురుస్తుండగా అటవీ ప్రాంతంనుంచి వారు వచ్చినట్టు తెలుస్తోంది. వ్యవసాయ కూలీలు ఉండే షెడ్‌లో కాసేపు సేదతీరే యత్నం చేశారు. అక్కడ తలుపులు వేసి ఉండడంతో సమీపంలో ఉండే తోట యజమాని ఇంటికి వెళ్లారు. వారి ఇంటి నుంచి రెండు కిలోల బియ్యం తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. అటవీప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్టు అను మానాలు వ్యక్తమవుతున్నాయి. బృందంలో నలుగురైదుగురు ఉన్నట్టు తెలుస్తుండగా ముగ్గురు మాత్రమే రైతు ఇంటికి వెళ్లినట్టు సుబ్రహ్మణ్య పోలీస్ స్టేషన్‌కు సమాచా రం అందింది. దీంతో యాంటినక్సల్స్ స్క్వాడ్ బలగాలు అక్కడ గాలింపులు ఆరంభించాయి.

అభివృద్ధికి ఓటు వేయండి



సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు

బొమ్మనహళ్ళి, మార్చి 24: ప్రధాని నరేంద్రమోదీ పదే ళ్లలో ఎంతో అభివృద్ధి చేశా రని, అలాగే నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని ఇందుకు ఓటు వేసి మరోసారి గెలిపించాలని ఎంపీ, బెంగళూరు దక్షిణ బీజేపీ అభ్యర్థి తేజస్వి సూర్య పేర్కొ న్నారు. నియోజకవర్గంలోని హెచ్ ఎస్ఆర్ లే అవుట్‌లో ఆదివారం పార్టీ కార్యకర్త సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనతో పోలిస్తే ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశంలో ఎంతో ప్రగతి సాధించిందన్నారు. ఇందుకు ఆయన దూరదృష్టియే కారణమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీని గెలిపించ డం ద్వారా మోదీని మరోసారి ప్రధాని చేయాలని ఇందుకు కార్యకర్తలు శ్రమించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, జయనగర ఎమ్మెల్యే సీకే రామ మూర్తి, ఎమ్మెల్సీ గోపినాథ్‌రెడ్డి, స్థానిక నాయకులు మంజునాథ్, మాజీ కార్పొరేటర్ భారతి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరంలో ఫ్లైరోబ్ స్టోర్ ఏర్పాటు

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యువత ఆధునికశైలి డిజైన్లకు ప్రాధాన్యత చూపుతున్న తరుణంలో ఫ్లైరోబ్ మల్లేశ్వరంలో కొత్త స్టోర్‌ను లాంచనంగా ఏర్పాటు చేసింది. అద్దెకు ఫ్యాషన్ డిజైన్‌లు పొందే సంప్రదాయం బెంగళూరులో పెరుగుతున్నందునే సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు సీఈఓ అంచల్‌సైని తెలిపారు. ఇప్పటికే ఒకశాఖ ద్వారా ప్రత్యేక ఆదరణ లభించిన మేరకే రెండోశాఖను తెరిచామన్నారు. మల్లేశ్వరం స్టోర్ ఫ్రాంచైజీ అశ్విని గురుచరణ్ మాట్లాడుతూ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త విధానాలు తీసుకొచ్చిన ఫ్లైరోబ్ స్టోర్ ఏర్పాటు సంతోషంగా ఉందన్నారు. 2015లో ఫ్లైరోబ్ కేంద్రం ఏర్పాటు కాగా డిజైన్లు, ఆభరణాలు అద్దెకు ఇచ్చే విధానం ద్వారా ఆదరణ పొందిందన్నారు.